సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 6 । ఫిబ్రవరి । 2025



రేషన్ బియ్యం సీజ్
నూజివీడు మండలంలోని మిట్టగూడెం వద్ద మంగళవారం అర్ధరాత్రి మినీ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 3.5 టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు సీజ్ చేశారు. 8లో ▸



పాపం పసిప్రాణం
రెండేళ్ల బాలుడిని ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొనడంతో మృతి చెందాడు. పెదపాడు మండలంలోని పాతముప్పర్రులో ఈ ఘటన చోటుచేసుకుంది. 8లో ▸



గండ్ల గుదిబండ
గతేడాది ఆగస్టు 31న కురిసిన భారీ వర్షాలకు నూజివీడులోని పెద్ద చెరువుకు గండ్లు పడి రోడ్లు సైతం ధ్వంసమయ్యాయి. ఇంత వరకు ఆ గండ్లు పూడ్చలేదు. 8లో ▸

సాగు చేపట్టేదెలా?

చేప రైతు కుదేలు
- మార్కెట్‌లో పడిపోయిన శీలావతి చేప ధర
- రానున్న వేసవిలో చేపకు గడ్డుకాలమేనంటున్న రైతులు
- జిల్లాలో 1.20 లక్షల ఎకరాల్లో చేపల పెంపకం



భీమవరం మండలంలోని నాగేంద్రపురం గ్రామంలో ఫంగస్ చేపలు పడుతున్న దృశ్యం

భీమవరం అర్బన్: ఆక్వా హబ్‌గా పేరుగాంచిన జిల్లాలో గత నెలరోజులుగా మార్కెట్‌లో చేప ధరలు పడిపోవడంతో రైతులు కుదేలవుతున్నారు. ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళా ప్రభావం కారణంగా చేప ఎగుమతులు మందగించాయి. దీంతో చేపలకు సరైన ధరలు పలకక రైతులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. భీమవరం, నరసాపురం, మొగల్తూరు, ఉండి, కాళ్ల, ఆకివీడు, వీరవాసరం యలమంచిలి, పాలకొల్లు, పాలకోడేరు, అత్తిలి, పెనుమంట్ర, ఆచంట తదితర మండలాల్లో సుమారు లక్షా 20 వేల ఎకరాల్లో ఆక్వా చేపలు, రొయ్యలు పెంపకం సాగిస్తున్నారు. ప్రధానంగా శీలావతి, కట్ల పెంపకం సాగిస్తుండగా రూప్‌చంద్, ఫంగస్, గడ్డి చేప, మోస్ తదితర సప్పనీటి చేపలను పెంచుతున్నారు. ముఖ్యంగా జిల్లా నుంచి ఉత్తరాది రాష్ట్రాలు, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, రాజస్థాన్, హర్యానా తదితర రాష్ట్రాలకు చేపలు ఎగుమతులు అవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా రోజుకు సరాసరి సుమారు 2 వేల నుంచి 2,500 టన్నులు ఎగుమతులు అవుతున్నాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.7,500 కోట్లు విదేశీ మారక ద్రవ్యం చేకూరుతుంది.

తీవ్రంగా నష్టపోయాం



వచ్చేది వేసవి కావడంతో రోజురోజుకు ఎండలు పెరుగుతున్నాయి. ఏప్రిల్ నుంచి కాలువలు కట్టేస్తారు. ఇప్పుడు చెరువులో చేపలను పట్టుబడులు పట్టి చిన్న చేపలు వేసుకుంటే వేసవి తాపం నుంచి గట్టెక్కుతాం. కుంభమేళా కారణంగా చేపలను అడిగే వ్యాపారస్తులు రావడం లేదు. ఈ ఏడాది తీవ్రంగా నష్టపోయాం

– పెనుమాల నరసింహస్వామి, చేప రైతు, గొల్లవానితిప్ప

కుంభమేళా ప్రభావం



జిల్లా నుంచి నార్త్, ఈస్టన్ రాష్ట్రాలైన పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, రాజస్థాన్, హర్యానా తదితర రాష్ట్రాలకు చేపలు ఎగుమతులు జరుగుతున్నాయి. కుంభమేళా 45 రోజులు ఆ రాష్ట్రాల్లో మాంసాహారం భుజించరు. దీంతో ఎగుమతులు తగ్గి చేప ధరపై పడింది. ఈ నెల మూడో వారం నుంచి చేప ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయి.

– ఎల్‌ఎల్‌ఎన్ రాజు, మత్స్యశాఖ ఇన్‌చార్జి ఏడీ, భీమవరం

కుంభమేళాతో మందగించిన చేప ఎగుమతులు **ఉత్తర ప్రదేశ్‌లోని** ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న **కుంభమేళా ప్రభా**వం జిల్లాలో చేప ఎగుమతులపై **తీవ్ర ప్రభావం** చూపింది. రోజుకు సుమారు 1500 **టన్నులు చేప ఎ**గుమతులు వెళ్లడం కష్టంగా మారిం**దని మత్స్యశాఖా**ధికారులు, రైతు విశ్లేషకులు చెబుతు**న్నారు. జనవరి** 13 నుంచి 45 రోజుల పాటు నార్త్, **ఈస్టన్ రాష్ట్రాలు** చేపలు తినకపోవడంతో చేప ఎగు**మతులు మంద**గించాయని చెబుతున్నారు.

ఆందోళనలో చేప రైతులు

సాధారణంగా చేప రైతులు ఫిబ్రవరి నుంచి **పట్టుబడికి వచ్చి**న చేపలు మార్కెట్‌కు తరలించి తమ చెరువుల్లో పిల్ల చేపలు వేసుకోవడం వల్ల వేసవికాలంలో ఎండ తీవ్రత నుంచి చేపలను రక్షించుకునేవారు. ఈ ఏడాది కుంభమేళా ప్రభావంతో చేపలు ఎగుమతులు నిలిచిపోవడంతో తమ చెరువుల్లోని చేపలను పట్టలేక చేప పిల్లలు వేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో కోట్లాది రూపాయలు నష్టం సాగులో వాటిల్లుతుందని రైతులు చెబుతున్నారు.

భారీగా తగ్గిన చేప ధర : కుంభమేళాకు ముందు కిలో శీలావతి ధర రూ.125, కట్ల రూ.140, రూప్‌చంద్ రూ. 135, గడ్డి చేప రూ.120, ఫంగస్ రూ.90 ఉన్నాయి. అంతేకాకుండా టన్నేజి ఆధారంగా కేజీకి రూ.5 నుంచి 10 వరకు పెంచి వ్యాపారస్తులు గతంలో కొనేవారు. ప్రస్తుతం శీలావతి కిలో రూ.105, కట్ల రూ.130, రూప్‌చంద్ రూ.120, గడ్డి చేప 100, ఫంగస్ రూ. 80 ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కేజీ లోపు వచ్చిన చేపలు కొన్న వ్యాపారస్తులు రావడం లేదని చేప రైతులు చెబుతున్నారు.

భారీ స్థాయిలో పెరిగిన చెరువు కౌలు

ఎకరం లీజు ఏడాదికి ప్రాంతాన్ని బట్టి రూ.60 వేలు నుంచి రూ.లక్షా 20 వేలు వరకు ఉన్నాయి. చేపలు 6 నుంచి 8 నెలల్లో పట్టుబడికి వస్తాయి. మేతఖర్చులు, కూలీలు ధరలు పెరిగిపోవడంతో ఇప్పటికే నష్టాలు వస్తున్నాయని చేపలు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుంభమేళా ప్రభావంతో ఈ ఏడాది సాగులో తీవ్ర నష్టాలు తప్పవని రైతులు గుబులు చెందుతున్నారు.

జిల్లా అభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి బ్యాంకర్లను కోరారు. జిల్లా కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాల్‌లో బుధవారం బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి జిల్లా వార్షిక రుణ ప్రణాళికను రూ.24,003 కోట్ల లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఇందుకు బ్యాంకర్లు రుణాలు మంజూరులో తమ వంతు సహకారాన్ని అందించి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ప్రాధాన్యత రంగాలకు రూ 20,473 కోట్లు రుణాలు లక్ష్యంగా నిర్ణయించగా వాటిలో తక్కువ కాలవ్యవధి వ్యవసాయ రుణాలకు రూ.8,899 కోట్లుకి గాను 5,083 కోట్లు ఇప్పటి వరకు మంజూరు చేసినట్లు చెప్పారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ 4,235 కోట్లుకి గాను రూ.2,960 కోట్లు మంజూరు చేశారని, వ్యవసాయ సాంకేతిక పరికరాలు తదితరాలకు రూ.1,019 కోట్లు నూరు శాతం మంజూరు చేశారని మిగతా లక్ష్యాలను మార్చిలోగా పూర్తి చేయాలన్నారు. ఎగుమతులతో కలిపి ఎంఎస్ఎంఈకి రూ.5,295 కోట్లుకి గాను రూ.4,183 కోట్లు మంజూరు చేశారని, ఇతర ప్రాధాన్యత రంగాలకు రూ.1,025 కోట్లుగా, అలాగే ప్రాధాన్యేతర రరంగాలకు రూ.3,530 కోట్ల రుణాలు లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. రుణాల మంజూరు లక్ష్య సాధనలో డిసెంబరు నెలాఖరు నాటికి వివిధ వ్యవసాయ రుణాలు ఇప్పటివరకు ఖరీఫ్, రబీకి 23,000 మంది లబ్ధిదారులకు సీసీర్సి కార్డుల ద్వారా రూ.180 కోట్లు కౌలు రైతులకు రుణాలు మంజూరు చేశారని, ఇంకా ఎక్కువగా లక్ష్య సాధనకు బ్యాంకర్ల సహకరించాలని కోరారు.

ఏఎంసీ ఆవరణలోనే శాశ్వత కలెక్టరేట్‌కు కృషి



భీమవరంలో మండలి చైర్మన్ మోషేనురాజుకు వినతిపత్రం అందిస్తున్న అఖిలపక్ష నాయకులు

భీమవరం: జిల్లా ప్రజలందరికీ అందుబాటులో ఏఎంసీ ఆవరణలోనే కలెక్టరేట్ శాశ్వత భవనాలు నిర్మించేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు స్పష్టం చేశారు. కలెక్టరేట్ తరలింపు, పర్మినెంట్ భవనాలు నిర్మాణాలపై జరుగుతున్న ప్రచారంపై బుధవారం అఖిలపక్ష నాయకులు భీమవరంలో మోషన్‌రాజును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఏర్పాటు, శాశ్వత భవనాల నిర్మాణం కోసం మార్కెట్ యార్డులో స్థల కేటాయింపు చేస్తూ జీవో నెం.124 జారీ చేశారని, 20 ఎకరాల భూమిని కేటాయించి రెవెన్యూ శాఖకు బదలయించారని చెప్పారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత కలెక్టరేట్ స్థలం మార్పుపై మీడియాలో విస్తృతమైన ప్రచారం జరుగుతుందని దీనిపై స్పష్టత ఇవ్వాలని, కలెక్టరేట్ ఏఎంసీ ప్రాంతంలోనే ఉండే విధంగా కృషిచేయాలని శాసనమండలి చైర్మన్, ఎమ్మెల్యేలను కోరగా వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఏఎంసీ ఆవరణలోనే కలెక్టరేట్ ఉంటుందని శాసనమండలి చైర్మన్ మోషేనురాజు భరోసా ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చినమిల్లి వెంకట్రాయుడు, గాదిరాజు రామరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, చింతకాయల బాబురావు, చెల్లబోయిన రంగారావు, బి వాసుదేవరావు, మల్లుల సీతారాం ప్రసాద్ తదితరులున్నారు.

నులిపురుగుల మాత్రలు వేయించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలను తప్పక వేయించాలని కలెక్టర్ సి.నాగరాణి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 10న ఆల్బెండజోల్ మాత్రలను అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ, కళాశాలల విద్యార్థులకు వేయించాలన్నారు. బడి బయట ఉన్న పిల్లలకు కూడా ఇప్పించేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

సీఐలపై చర్యలకు రంగం సిద్ధం!

- ఇప్పటికే వీఆర్‌లో ఒకరు, సెలవులోకి మరొకరు?
- దిగువస్థాయి సిబ్బంది తీరుపైనా అనుమానాలు
- ఎస్సై మూర్తి ఆత్మహత్య ఘటనలో తాజా పరిణామాలు

సాక్షి, భీమవరం/ తణుకు అర్బన్: సంచలనం కలిగించిన ఎస్సై ఆత్మహత్య ఘటనలో బాధ్యులపై చర్యలకు రంగం సిద్ధమైంది. సోషల్ మీడియాలో వైరల్ అయిన ఆడియో, ఎస్సై సెల్‌ఫోన్‌లో లభ్యమైన సమాచారాన్ని బట్టి చర్యలకు ఉన్నతాధికారులు ఉపక్రమించినట్టు తెలుస్తోంది. తణుకు రూరల్ ఎస్సైగా పనిచేసి వీఆర్‌లో ఉన్న ఏజీఎస్ మూర్తి గతనెల 31న స్టేషన్‌కు వచ్చి తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆయన సెల్‌ఫోన్‌ను పై అధికారులు స్వాధీనం చేసుకోవడం వివాదాస్పదమైంది. తన ఆత్మహత్యకు బాధ్యుల వివరాలను ఎస్సై మూర్తి సెల్‌లో టైప్ చేశారని, ఆ సమాచారం బయటపెట్టాలని ఆయన సహచర ఎస్సైలు స్టేషన్ లోపల పైఅధికారులతో వాగ్వావాదానికి దిగడం బయట ఉన్న వారికి వినిపించింది. ఇదిలా ఉండగా ఎస్సై మూర్తి ఆత్మహత్యకు పాల్పడే ముందు తన స్నేహితునితో మాట్లాడినట్టుగా ఒక ఆడియో నాలుగు రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అందులో తనను మోసం చేసిన వారంతా హ్యాపీగా ఉన్నారని, సీఐలు కృష్ణకుమార్, నాగేశ్వరరావు చేసిన పనికి ఈరోజు ఇలా అయిపోయానని, తనను ఇబ్బంది పెట్టవద్దని వారిని వేడుకున్నా.. లేదు లేదు ఎమ్మెల్యే గారు చెప్పారు కదా? అదీఇదీ అంటూ తన జీవితాన్ని నాశనం చేశారని మూర్తి కుమిలిపోతున్నట్టుగా ఉంది. రాజకీయ నాయకుల ఒత్తిళ్లు తాళలేక, తాను చేయని తప్పునకు బాధ్యుడిని చేసి ఇబ్బందులు పెడుతున్నారన్న బాధతో ఎస్సై మూర్తి ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీస్ వర్గాల్లో చర్చించుకుంటున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోకుంటే కిందిస్థాయి సిబ్బందిలో అభద్రతా భావం పెరుగుతుందన్న ఆలోచనలో ఉన్నతాధికారులు ఉన్నట్టు సమాచారం. సోషల్ మీడియాలో వచ్చిన ఆడియోలోని వివరాలతో పాటు సెల్‌ఫోన్‌లో సమాచారం ఆధారంగా ఉన్నతాధికారులు లోపాయికారీగా శాఖాపరమైన చర్యలు చేపట్టినట్టు తెలుస్తోంది. కేసుకు సంబంధించి ఏ సమాచారం బయటకు రాకుండా పోలీసులు రహస్యంగా విచారణ జరిపిస్తున్నారు. ఒక సీఐ ఇప్పటికే వీఆర్‌లో ఉండగా, మరో సీఐను సెలవుపై వెళ్లాల్సిందిగా ఆదేశించినట్టు తెలుస్తోంది. సదరు సీఐ బుధవారం విధులకు హాజరుకాలేదని, మరి కొందరిపైనా చర్యలు ఉంటాయని సమాచారం.

ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి : జేసీ

నరసాపురం రూరల్: శిక్షణ పొందిన మహిళలు పదిమందికి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని జాయింట్ టి కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం స్థానిక అంతర్జాతీయ లేసు ట్రేడ్ సెంటర్ (ఐఎల్‌టీసీ)లో నిర్వహించిన వ్యవస్థాపకత అభివృద్ధి ముగింపు కార్యక్రమంలో జేసీ పాల్గొని మాట్లాడారు. రాబోయే కాలంలో అమెజాన్, ఫ్లిప్‌కార్టు మాదిరిగా ఓపెన్ నెట్‌వర్కు డిస్ట్రిబ్యూషన్, ఇ కామర్స్ ఒక పెద్ద ప్లాట్‌ఫామ్‌గా తీర్చిదిద్దబడుతుందన్నారు. వీటిపై మహిళలు అవగాహన పెంచుకుని స్వయం కృషితో అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు జేసీ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఐఎల్‌టీసీ కన్వీనర్ కలవకొలను నాగ తులసీరావు, తహసీల్దార్ టి రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దెందులూరులో పచ్చ దందా

- అనుమతులు లేకుండా అడ్డగోలుగా గ్రావెల్ తవ్వకాలు
- మూడెకరాల్లో 2 వేలకుపైగా లారీల్లో గ్రావెల్ తరలింపు
- తవ్వకాలు అడ్డుకున్న పొలం యజమానిపై దాడి, దౌర్జన్యం
- ఫిర్యాదు చేసినా స్పందించని దెందులూరు ఎస్సై
- భూయజమాని ఫిర్యాదులు పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం
- పొలంలోకి వస్తే అట్రాసిటీ కేసులు పెడతామని బెదిరింపులు



దెందులూరు మండలం చల్లచింతలపూడిలో అక్రమంగా తవ్వేస్తున్న గ్రావెల్



పోలీసుల సమక్షంలోనే గ్రావెల్ తవ్వకాలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో గ్రావెల్ దందా తారాస్థాయికి చేరింది. నిన్నమొన్నటి వరకు పోలవరం గట్లు అసైన్డ్ భూముల్లో గ్రావెల్ దందా సాగించిన మాఫియా లీజు పేరుతో ప్రైవేటు పొలాలపై పడగవిప్పారు. అన్ని అనుమతులు తీసుకుని సక్రమంగా గ్రావెల్ తవ్వకుంటామని భూ యజమానికి నమ్మకంగా చెప్పి లీజు అగ్రిమెంట్ చేసుకుని ఎలాంటి అనుమతులు లేకుండా అడ్డగోలుగా సాగిస్తున్నారు. అడ్డుకోవడానికి యత్నించిన పొలం యజమానిపై దాడి చేసి దౌర్జన్యం చేసి ఎమ్మెల్యే చింతమనేని మనుషులం.. నువ్వేమి చేయలేవంటూ హెచ్చరించారు. స్థానిక ఎస్సై మొదలు జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారుల వరకు అన్ని కార్యాలయాలకు పొలం యజమాని ఫిర్యాదు చేసినా పట్టించుకోని పరిస్థితి.

దెందులూరు మండలంలోని చల్లచింతలపూడిలో సర్వే నెంబర్ 12/2, 13/4లో విజయవాడకు చెందిన దాసరి బాబురావుకు 9.57 ఎకరాల భూమి ఉంది. 2005లో భూమిని కొనుగోలు చేసి లీజుకు ఇచ్చారు. అరటి, పామాయిల్ సాగు పొలంలో చేస్తున్నారు. ఈ క్రమంలో బాబురావు సమీప బంధువు, మండల టీడీపీ నాయకుడు పుసులూరి సత్యనారాయణ (బోస్), నాగబోయిన సత్యనారాయణ సెప్టెంబర్‌లో గ్రావెల్ తవ్వకాలకు భూ యజమాని నుంచి అగ్రిమెంట్ చేసుకుని భూమిని తీసుకున్నారు. ఎకరాకు రూ.13 లక్షలు చెల్లించేలా అది కూడా రెవెన్యూ ఎన్‌ఓసీ, మైనింగ్ డిపార్ట్‌మెంట్ నుంచి అన్ని అనుమతులు తీసుకునే గ్రావెల్ తవ్వేలా అగ్రిమెంట్ చేసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పొలం యజమాని ఈ ఏడాది జనవరి 18న లీజుదారులను ప్రశ్నించి తవ్వకాలను అడ్డుకోవడంతో వివాదం చెలరేగింది. భూ యజమాని దాసరి బాబురావు, ఆయన భార్య నాగలక్ష్మిపై లీజుదారులు దౌర్జన్యం చేసి దాడి చేశారు. అనుమతులు తీసుకున్నా తరువాతనే తవ్వకాలు చేయాలని లేదంటే మైనింగ్ ఆపివేయాలని చెప్పి పొలంలో కూర్చొంటే దెందులూరు పోలీసుల సాయంతో యజమానులను పంపివేశారు. తాజాగా 3వ తేదిన మళ్లీ పొలం వద్దకు వెళితే లీజుదారులు అడ్డుకోవడం, ఎస్సై వచ్చి స్టేషన్‌కు వచ్చి మాట్లాడమని అక్కడ నుంచి పంపడం, ఆ మరుసటి రోజు బాబురావు తన వాహనం (ఏపీ16 సీయూ8505) వేసుకుని పొలం వద్దకు వెళితే లీజుదారులు కారు ఎత్తుకెళ్లడంతో పాటు మళ్లీ ఘర్షణలకు దిగారు. ఆ మరుసటి రోజు కొందరు మహిళలు భూ యజమానిని అడ్డుకుని కేసు పెడతామని బెదిరించారు.

ఎస్సై నుంచి కలెక్టరేట్ వరకు ఫిర్యాదులు చేసినా..



భూ యజమాని దాసరి బాబురావు, నాగలక్ష్మి

భూ యజమాని దాసరి బాబురావు దంపతులు దెందులూరు ఎస్సై, మైనింగ్ ఏడీకి, దెందులూరు తహసీల్దార్ కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయానికి, ఎస్పీ కార్యాలయానికి, డీఐజీ కార్యాలయానికి రాతపూర్వకంగా ఫిర్యాదులు చేసినా ఒక్క శాఖ కూడా పట్టించుకోలేదు. రెండురోజుల క్రితం ఏఎస్పీని కలిసి ఫిర్యాదు చేసినా కనీసం స్పందించి తమకు న్యాయం చేయడం లేదని బాబురావు ఆవేదన వ్యక్తం చేశారు. తన పొలంలోకి తాను వెళితే అధికార పార్టీ పేరు చెప్పి దాడి చేసి దౌర్జన్యం చేస్తున్నారు. ఏ ఒక్క ప్రభుత్వ శాఖ కూడా పట్టించుకోవడం లేదని 7, 8 అడుగుల తవ్వాల్సిన గ్రావెల్ 15 అడుగుల మేర తవ్వేసి 2 వేల లారీల గ్రావెల్‌ను విక్రయించారని తెలిపారు.

ఏసీబీకి చిక్కిన ఫుడ్ సేఫ్టీ అధికారి

ఏలూరు టౌన్: లంచం డిమాండ్ చేసిన ఏలూరు ఫుడ్‌సేఫ్టీ అధికారి, ఆఫీస్ అటెండర్‌ను ఏలూరు అవినీతి నిరోధక శాఖ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఏలూరు అభివృద్ధి నిరోధక శాఖ డీఎస్పీ వి.సుబ్బరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు మండలం కాట్లంపూడి గ్రామానికి చెందిన సాయి సుందర్ గోకుల్ అదే ప్రాంతంలో ఊప్స్ గోలీ సోడా కంపెనీ పేరుతో గోలీ సోడాను తయారు చేస్తున్నాడు. గోలి సోడా తయారీలో అధికంగా రసాయనాలు వినియోగిస్తున్నట్లు గుర్తించామనీ ఏలూరు ఫుడ్‌సేఫ్టీ అధికారి దొండపూడి కావ్యరెడ్డి, కార్యాలయ అటెండర్ పుల్లారావు గోకుల్‌కు ఫోన్ చేసి చెప్పారు. విక్రయాలు సాఫీగా సాగాలంటే రూ.25 వేల లంచం డిమాండ్ చేశారు. ఎట్టకేలకు ఫుడ్‌సేఫ్టీ అధికారికి రూ.20 వేలు, సహాయకుడికి రూ.2 వేలు ఇచ్చేందుకు గోకుల్ సిద్ధపడ్డాడు. ఈ నేపథ్యంలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు డబ్బులు కోసం వేధించటంతో గోకుల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం రాత్రి 8.30 గంటల సమయంలో లంచం సొమ్మును ఫుడ్‌సేఫ్టీ అధికారి డి.వెంకట కావ్య రెడ్డికి, అటెండర్ పులపా పుల్లారావుకు గోకుల్ కార్యాలయంలో అందించాడు. అప్పటికే అవినీతి నిరోధక శాఖ అధికారులు వలపన్ని ఉండటంతో వెంటనే వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. ఫుడ్‌సేఫ్టీ అధికారి కావ్యరెడ్డి, అటెండర్ పుల్లారావు నుంచి రూ.22 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఫుడ్‌సేఫ్టీ అధికారి వినియోగిస్తున్న కారును తనిఖీ చేయగా లెక్కలు లేకుండా ఆరు కట్టలుగా కట్టి ఉన్న మరో రూ.87 వేల నగదును గుర్తించారు. మొత్తంగా రూ.లక్షా 9 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఫుడ్‌సేఫ్టీ అధికారి, అటెండర్ ఇంట్లోనూ ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. ఏలూరు ఏసీబీ డీఎస్పీ వీ.సుబ్బరాజు, సీఐలు ఎస్.బాలకృష్ణ, కే.శ్రీనివాస్, రాజమహేంద్రవరం ఏసీబీ అధికారి వాసుకృష్ణ ఉన్నారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



భీమవరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో పలు విభాగాల అధ్యక్షులను పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ప్రకటించింది. విభాగాల వారీగా అధ్యక్షులు.. యూత్ విభాగానికి చిగురుపాటి సందీప్ (భీమవరం), మహిళా విభాగానికి కోడి విజయలక్ష్మి (భీమవరం), ఎస్టీసెల్ విభాగానికి బండి రమేష్ (పాలకొల్లు), కల్చరల్ విభాగానికి పి.వెంకటేశ్వరరావు (పాలకొల్లు), వైఎస్సార్ టీయూసీకి ఇంటి సత్యనారాయణ (భీమవరం), వాణిజ్య విభాగానికి రాజా బాల మస్తానయ్య (భీమవరం), క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కి కుంచనపల్లి విన్స్‌టన్ బాబు (పాలకొల్లు), డాక్టర్స్ విభాగానికి పుల్లేటి విఠల్‌ప్రసాద్ (తాడేపల్లిగూడెం), ఇంటలెక్చువల్ ఫోరంనకు వంగలపూడి జక్కరయ్య (నరసాపురం), మున్సిపల్ విభాగానికి పేరిచర్ల సత్యనారాయణరాజు (భీమవరం), బూత్ కమిటీకి డీవీడీ ప్రసాద్ (భీమవరం), ఎంప్లాయీ, పెన్షనర్స్ విభాగానికి పెన్మెత్స రామరాజు (తణుకు).

ముద్రగడకు సంఘీభావం



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

కైకలూరు: వైఎస్సార్ సీపీ నాయకుడు మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంను పార్టీ నాయకులు ఆయన నివాసంలో బుధవారం కలిసి తమ సంఘీభావం తెలిపారు. ముద్రగడ నివాసంపై ఇటీవల దాడి జరిగిన విషయం విదితమే. మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ అడపా శేషు, ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్‌తో పాటు మండవల్లి ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ కైకలూరు మండల పార్టీ అధ్యక్షుడు శింగంశెట్టి రాము, పంజా రామారావు, కన్నా రమేష్ ముద్రగడకు సంఘీభావం తెలిపినవారిలో ఉన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు కొలువులు

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో పలు సంస్థలు నిర్వహించిన క్యాంపస్ సెలెక్షన్స్‌లో 46 మంది ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరం విద్యార్థులు పలు ఉద్యోగాలకు ఎంపికైనట్లు నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు. ఇన్ఫోసిస్ సంస్థ నిర్వహించిన సెలక్షన్స్‌లో 25 మంది హాజరుకాగా అందులో 22 మంది ఎంపికయ్యారు. వీరిలో 20 మంది సీఎస్ఈ విద్యార్థులు కాగా, ఈసీఈ విద్యార్థులు ఇద్దరు ఉన్నారు. ఎంపికైన 22 మంది బాలికలే కావడం గమనార్హం. అలాగే హెటెరో డ్రగ్స్‌కు కెమికల్ ఇంజినీరింగ్‌కు చెందిన 18 మంది విద్యార్థులు జూనియర్ ఇంజినీర్లుగా ఎంపికయ్యారు. వీరిలో 10 మంది బాలురు, 8 మంది బాలికలు ఉన్నారు. శ్రీకర కన్‌స్ట్రక్షన్స్‌కు 6గురు సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థినులు ఎంపికయ్యారు. వీరిని డైరెక్టర్‌తో పాటు ఏఓ బీ లక్ష్మణరావు, డీన్ అకడమిక్ చిరంజీవి తదితరులు అభినందించారు.

ఆకట్టుకున్న జాతీయ సమైక్యతా ర్యాలీ



వలంధర్‌రేవు వద్ద ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ర్యాలీ

నరసాపురం: స్థానిక వైఎన్ కళాశాలలో జాతీయ సేవా పథకం, మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ సమైక్యతా శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. బుధవారం 12 రాష్ట్రాలకు చెందిన వలంటీర్లు తమ రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ వేషధారణలతో పట్టణంలో నిర్వహించిన ర్యాలీ ఆకట్టుకుంది. ఆర్డీవో దాసి రాజు ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 200 మంది వలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని ఎన్ఎస్ఎస్ లక్ష్యాలపై అవగాహన కల్పించే ప్రయత్నం చేయడం మంచి విషయమన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించాలి


గోపాలన్

భీమవరం: టిడ్కో గృహాలను తక్షణం జిల్లాలోని లబ్ధిదారులందరికీ ఇవ్వాలని లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ హెచ్చరించారు. బుధవారం భీమవరంలో పార్టీ కార్యాలయంలో గోపాలన్ మాట్లాడుతూ 18 ఏళ్ల క్రితం ఇళ్ల స్థలాల కేటాయింపునకు ప్రయత్నం ప్రారంభిస్తే నేటికీ లబ్ధిదారులకు ఇళ్లను ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. జిల్లాలో 20,752 లబ్ధిదారులకుగాను కేవలం 8 వేల మందికి మాత్రమే ఇళ్ల స్వాధీనం చేశారని మండిపడ్డారు. విద్యుత్, మంచినీరు, డ్రెయినేజీ వంటి కనీస మౌలిక వసతులు లేకపోవడంతో నివాసితులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు టిడ్కో ఇళ్లను వెంటనే స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమికి బుద్ధి చెప్పాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

భీమవరం: సూపర్ సిక్స్ అంటూ మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చి హామీలన్నింటినీ తుంగలోకి తొక్కిన కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలంటే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని ఓడించాలని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ పిలుపునిచ్చారు. బుధవారం భీమవరంలోని బేతనిపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అబద్ధాలు చెప్పడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా పింఛన్ల పెంపు హామీ తప్ప ఇతర పథకాలన్నీ గాలికివదిలి ప్రజలను ఇబ్బందులు పాలుచేస్తున్నారన్నారు. హామీల శాసనమండలిలో సామాన్యుడి గొంతు వినిపించాలన్నా, కూటమినాయకులు ఇచ్చిన హామీలు అమలు కావాలన్నా ఈనెల 27న జరుగుతున్న ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో జీవీ సుందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని హర్షకుమార్ కోరారు. సమావేశంలో పట్టా దేవరాజ్, వర్గీస్ దానియేలు, గంటా రాహుల్‌రిచర్డ్స్, పీపీ విల్సన్, గంటా సుందర్‌కుమార్ పాల్గొన్నారు.

అప్పు తీర్చినా వేధిస్తున్నారని దంపతుల నిరసన

పెంటపాడు: అప్పు తీర్చినా సరే తమ ప్రామిశరీ నోట్లు, చెక్కులు ఇవ్వకుండా తమను కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని, వారిపై అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని పెంటపాడుకు చెందిన రెడ్డి రాంబాబు, నాగలక్ష్మి దంపతులు ధన్యమహిళామండలి ఆధ్వర్యంలో కర్రి విజయ కుమారి ఇంటివద్ద బుధవారం నిరసనకు దిగారు. రూ.30 లక్షలు అప్పుగా తీసుకుని వడ్డీతో సహా రూ.45 లక్షలు చెల్లించినా కునాకర పేటకు చెందిన కర్రి విజయకుమారి, కాకినాడకు చెందిన నానిబాబులు తమను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యురాలు పోతంశెట్టి లక్ష్మి, తాడేపల్లి లక్ష్మి తదితరులు బాధితులకు సంఘీభావం ప్రకటించారు. పెంటపాడు ఎస్సై స్వామి సంఘటనా స్థలానికి చేరుకొని దీక్షను భగ్నం చేశారు. ఎన్నికల కోడ్ సమయంలో నిరసన దీక్షకు కూర్చోవడం నేరమన్నారు. ఇరువర్గాల పెద్దలతో చర్చించి వారి ద్వారా రాజీ చేసుకోవాలని ఎస్సై స్వామి బాధితులకు సూచించారు.

గండ్ల గుదిబండ


నూజివీడు పెద్దచెరువుకు పడిన గండి


తాత్కాలికంగా గండికి రింగ్ బండ్ ఏర్పాటు చేసిన దృశ్యం

- పట్టణంలో ప్రమాదకరంగా పెద్ద చెరువు
- గండ్లు పడి ఐదు నెలల పూర్తయినా పట్టించుకోని వైనం

నూజివీడు: పట్టణంలోని పెద్ద చెరువుకు పడిన గండ్లు ఎప్పుడు పూడుస్తారో? అని పట్టణ ప్రజలు, ఆయకట్టు రైతులు ఎదురు చూస్తున్నారు. గతేడాది ఆగస్టు నెల చివరి వారంలో భారీ వర్షాలు కురవడంతో ఆగస్టు 31న పెద్ద చెరువుకు నాలుగు చోట్ల గండ్లు పడి చెరువులోని నీళ్లన్నీ బయటకుపోయాయి. భారీ వర్షాలకు చెరువుకు ఎగువన ఉన్న సిద్ధార్థనగర్ ప్రాంతాల్లోని కొండల నుంచి పెద్ద ఎత్తున వరద నీరు చేరి చెరువుకు నాలుగు చోట్ల గండ్లు పడ్డాయి. దీంతో వరదనీరు ముంచెత్తడంతో రోడ్లు సైతం ధ్వంసమయ్యాయి. గండ్లు పడి ఐదు నెలలు గడిచినా ఇంత వరకు వాటిని పూడ్చలేదు. గండ్ల వద్ద కేవలం తాత్కాలిక రింగ్‌బండ్ మాత్రమే వేసి వదిలేశారు. దీంతో ఈ గండ్లు పూడ్చటానికి ఎంత కాలం పడుతుంది? అని పట్టణ ప్రజలు ప్రజలు ఈ చెరువు ఒక్కసారి నిండితే రెండేళ్ల పాటు సాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదని స్థానికులు పేర్కొంటున్నారు. ఒకవైపు సాగునీటిని అందించడంతో పాటు చెరువు నిండుగా ఉంటే పట్టణంలోని బావులు, బోర్లలో నీటి మట్టం పడిపోదని చెబుతున్నారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన చెరువు గండ్లను పూడ్చడానికి నెలల తరబడి జాప్యం చేయడంపై ఆయకట్టు రైతులు, పట్టణ ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

రింగ్‌బండ్‌లకు మాత్రమే పరిమితం

పెద్దచెరువుకు కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఒక గండి, పెట్రోలు బంకు, పాత గ్యాస్ గోడౌన్‌ల వద్ద మరో మూడు గండ్లు పడ్డాయి. ఈ గండ్లకు తాత్కాలికంగా రింగ్‌బండ్‌లను మాత్రమే వేసి ఉంచారు. అలాగే చెరువుకు చెందిన పెద్ద తూము, చిన్న తూము లు దెబ్బతిన్నాయి. వీటికి కూడా మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు. యనమదల వద్ద ఉన్న ఎత్తిపోతల పథకం ద్వారా సాగర్‌జలాలతో పెద్ద చెరువును నింపుకోవచ్చు. 200 ఎకరాల విస్తీర్ణం ఉన్న పెద్ద చెరువు కింద దాదాపు 350 ఎకరాల ఆయకట్టు ఉండగా, అందులో కొంత భాగం ప్రజలు ఇళ్లు నిర్మించుకోవడంతో పంటలు పండే ఆయకట్టు తగ్గింది. చెరువులో దక్షిణ, పడమర భాగాల్లో చాలా భాగం ఆక్రమణకు గురైంది. ఈ ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వచ్చే వర్షాకాలం నాటికైనా చెరువు గండ్లను పూడ్చించి చెరువును సిద్ధంగా ఉంచాలని కోరుతున్నారు.

గండ్లను త్వరితగతిన పూడ్చాలి



“పెద్దచెరువుకు పడిన గండ్లను త్వరితగతిన పూడ్చాలి. గండ్లు పడి ఇప్పటికే ఐదు నెలలు గడిచిపోయాయి. మరో నాలుగు నెలలు గడిస్తే వర్షాకాలం వస్తుంది. కాబట్టి గండ్లను పూడ్చే పనులను త్వరితగతిన ప్రారంభించి పనులను పూర్తిచేయాలి. కట్టకు లోపలి వైపు రివిట్‌మెంట్ కట్టి బలోపేతం చేయాలి. ఆయకట్టు రైతులకు సాగునీరు ఎంతో అవసరం.

– నవుడు నాగమల్లేశ్వరరావు, 32వ వార్డు కౌన్సిలర్, నూజివీడు

రూ.80 లక్షలతో ప్రతిపాదనలు పంపాం

పెద్దచెరువుకు పడిన నాలుగు గండ్లను పూడ్చేందుకు గానూ రూ.80 లక్షలతో అంచనాలు రూపొందించి నిధుల మంజూరు కొరకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులను ప్రారంభించి పూర్తి చేస్తాం. గతంలో తాత్కాలికంగా రింగ్‌బండ్‌లు వేయించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– సలీం భాషా, ఇరిగేషన్ ఏఈ, నూజివీడు

పని మనిషే అసలు ముద్దాయి

12 గంటల్లోనే దొంగతనం కేసు ఛేదించిన పోలీసులు

ఆకివీడు: దొంగతనం జరిగి, ఫిర్యాదు అందిన 12 గంటల్లోని ఆ కేసును పోలీసులు ఛేదించారు. బుధవారం ఆకివీడులోని సీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను ఎస్పీ అద్నాన్ నయీమ్ వెల్లడించారు. వివరాల్లోకి వెళ్లితే కాళ్ల మండలం పెదఅమిరం గ్రామంలోని సిల్వర్ స్ప్రింగ్ విల్లాస్‌లో బలిరెడ్డి వరలక్ష్మి ఇంటి పని చేస్తుంది. ఆ ఇంటి యజమాని, అతని భార్య ఈ నెల 1న హైదరాబాద్ వెళ్లారు. 4న సాయంత్రం ఇంటికి వచ్చే సరికి తలుపులు తీసి ఉన్నాయి. వెంటనే లోపలకు వెళ్లి చూడగా బీరువా కూడా తెరచి ఉండడంతో అందులోని 43.4 కాసుల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని గుర్తించి కాళ్ల పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి 9 గంటలకు ఆశ్రయించారు. ఉండి మండలం మహాదేవపట్నం శివారు భవానీపురానికి చెందిన బలిరెడ్డి వరలక్ష్మి తమ ఇంట్లో పని చేస్తుందని, ఆమెపైనే అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొనడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం వాచ్‌మెన్ తెలిపిన వివరాల ప్రకారం ఆధారాలు సేకరించి 12 గంటల్లోనే కేసును ఛేదించారు. పనిమనిషి వద్ద రూ.17.20 లక్షల విలువైన 43.4 కాసుల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ అస్మి వివరించారు. కొద్ది గంటల్లోనే దొంగతనం కేసును ఛేదించిన ఎస్ఐ శ్రీనివాసరావు, సీఐ జగదీశ్వరరావులను అభినందించి, నగదు రివార్డు అందజేశారు.


దోపిడీకి గురైన సొత్తును స్వాధీనం చేసుకుని విలేకర్లకు వివరిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ

మోటారు సైకిల్ దొంగ అరెస్టు

చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఆకివీడు మండలం చినకాపవరం చినకాపవరానికి చెందిన బైరే వీరాస్వామి అరెస్ట్ చేశామని ఎస్పీ తెలిపారు. నిందితుడు ఆకివీడు, నిడదవోలు, ఉండి, కాళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు మోటారు సైకిళ్లను దొంగిలించినట్టు అంగీకరించడంతో ఆ మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఎస్పీ వెంట డీఎస్పీ ఆర్జీ జయసూర్య, ఎస్సై హనుమంతు నాగరాజు ఉన్నారు.

వాసవీధాం పీఠాధిపతిగా ప్రజ్ఞానంద సరస్వతీ స్వామీజీ

పాలకొల్లు అర్బన్: అఖిల భారత వాసవీ ధాం పెనుగొండ ట్రస్ట్ పీఠాధిపతిగా తెనాలి శ్రీ విద్యా పీఠానికి చెందిన ప్రజ్ఞానంద సరస్వతీ స్వామీజీ ఈ నెల 8న పట్టాభిషిక్తుడు కానున్నట్లు వాసవీ ధాం రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ తెలిపారు. పాలకొల్లు వాసవీ కల్యాణ మండపంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు పీఠాధిపతిగా వ్యవహరించిన కృష్ణానందపురి స్వామీజీ మృతి చెందారన్నారు. దీంతో ఆయన స్థానంలో ప్రజ్ఞానంద సరస్వతీ స్వామీజీ పట్టాభిషిక్తులు కానున్నట్లు చెప్పారు. పెనుగొండలో జరిగే పట్టాభిషేకం కార్యక్రమానికి పలువురు స్వామీజీలు, పీఠాధిపతులు హాజరుకానున్నట్లు వివరించారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బంగారు ఉషారాణి, ఆర్య వైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు చిర్లంచర్ల సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి కందకట్ల రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న వాసవీధాం రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ

వైఎస్సార్ సీపీ ఫీజుపోరుకు మద్దతు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేద విద్యార్థులకు ఉపయోగపడే ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో రూ.350 కోట్లు రిలీజ్ చేయమని మార్చి 12న రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఫీజు పోరు ధర్నాకు మాల మహానాడు సంపూర్ణ మద్దతు ఇస్తుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. పట్టణంలో మంగరాజు ఆధ్వర్యంలో బుధవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంగరాజు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ పద్మశ్రీ అవార్డుకు అర్హుడు కాదని, ఉద్యోగం వదలి, దళితుల హక్కుల కోసం ఎనలేని కృషి చేసిన గద్దర్, కత్తి పద్మారావు, కెజీ సత్యమూర్తులు పద్మశ్రీ అవార్డుకు అర్హులన్నారు. కార్యక్రమంలో గోళ్ళ అరుణ్ కుమార్, నరసింహయ్య, తిరగటి శివ, గోదా జాన్‌పాల్, ఉన్నమట్ల విజయ్‌కుమారి పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంగరాజు

జాతీయ ఆర్చరీ పోటీల్లో ప్రతిభ


పోటీల్లో పతకాలు గెల్చుకున్న సూర్యహంసిని, గణేష్ మణిరత్నం

భీమవరం: ఉత్తరాఖండ్‌లో నిర్వహించిన 38వ జాతీయ క్రీడల ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భీమవరం పట్టణానికి చెందిన మాదాల సూర్యహంసిని, నెల్లూరు చెందిన టి.గణేష్ మణిరత్నం మిక్సిడ్ ఆంధ్రప్రదేశ్ జట్టు కేటగిరిలో వెండి పతకాన్ని గెలుచుకున్నారని ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ బుధవారం విలేకరులకు తెలిపారు. ఉత్తరాఖండ్ ఆర్‌జీసీఎస్ గ్రౌండ్, రజత్ జయంతి ఖేల్ పారిసార్ గ్రౌండ్‌లో ఈనెల 1 నుంచి నిర్వహించిన కాంపౌడ్ విలువిద్య పోటీల్లో సూర్యహంసిని, గణేష్‌మణిరత్నం వెండి పతకాన్ని గెల్చుకోగా వ్యక్తిగత కేటగిరిలో గణేష్‌మణిరత్నం కాంస్య పతకాన్ని గెల్చుకున్నట్లు సత్యనారాయణ వివరించారు. విజేతలిద్దరూ కమల్‌కిషోర్ వద్ద శిక్షణ పొందుతున్నట్లు చెప్పారు.

స్కూల్ బస్సు ఢీకొని బాలుడి మృతి

పెదపాడు: స్కూల్ బస్సు ఢీకొనడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పెదపాడు మండలంలోని పాతముప్పర్రు గ్రామానికి చెందిన వలదాసి దాసి ఏసుపాదం రెండో కుమారుడు శ్రీ దీక్షిత్(2) బయట ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొట్టింది. చెవుల వెంబడి రక్తం కారుతున్న బాలుడుని బంధువులు స్థానికులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలుడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాలుడి తండ్రి ఏసుపాదం ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ కృష్ణ కేసు నమోదు చేశారు.

3.5 టన్నుల రేషన్ బియ్యం సీజ్

నూజివీడు: మండలంలోని మిట్టగూడెం వద్ద మంగళవారం అర్ధరాత్రి మినీ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 3.5 టన్నుల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయిస్ అధికారులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు ఏలూరు డీఎస్‌ఓ సత్యనారాయణరాజు, నూజివీడు సివిల్ సప్లయిస్ డీటీ జి.వెంకటేశ్వరరావు సిబ్బందితో కలిసి మిట్టగూడెం వద్ద అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో వ్యాన్‌ను తనిఖీ చేసే సమయంలో రేషన్ బియ్యాన్ని గుర్తించి సీజ్ చేశారు. ఆ బియ్యాన్ని అన్నవరం రైస్ మిల్లులో భద్రపరచి, వాహనాన్ని రూరల్ పోలీస్‌స్టేషన్లో అప్పగించారు. బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఎం.కృష్ణ శివదీప్, పెద్దిరెడ్డి రామచంద్రరావు, చప్పిడి వెంకట కృష్ణలపై 6(ఏ), 7(1) కేసులను నమోదు చేశారు.

క్లుప్తంగా

చెత్త సంపద తయారీ కేంద్రాల పరిశీలన



మాధవరంలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లోని చెత్త నుంచి సంపద కేంద్రాలను బుధవారం ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, తడి, పొడి చెత్త వేర్వేరు చేసే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. మారంపల్లి ఉప సర్పంచ్ సరిపెల్లి పెదకృష్ణంరాజు, కార్యదర్శులు ఫణికుమార్, అహ్మద్, శ్రీకృష్ణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

ఆక్రమణల తొలగింపు



రోడ్లపై ఆక్రమణలు తొలగింపు ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ ఎం.ఏసుబాబు

తాడేపల్లిగూడెం: పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన దుకాణాల ముందు ఉన్న ఆక్రమణలను బుధవారం మునిసిపల్ అధికారులు తొలగించారు. దుకాణాలను దాటి వస్తువులను రోడ్డుపైకి పెట్టడంతో వాహన చోదకులకు ఇబ్బంది కలుగుతోంది. ఈ నేపథ్యంలో అధికారులు ఆక్రమణలను తొలగించారు. ఈ పనులను కమిషనర్ ఎం.ఏసుబాబు పర్యవేక్షించారు.

మద్యం దుకాణాల దరఖాస్తు గడువు పెంపు

తాడేపల్లిగూడెం: గీత కులాల కోసం కేటాయించిన మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకొనే గడువు పెంచినట్టు గూడెం ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. గూడెం మునిసిపాలిటీ, అత్తిలి మండలం, గణపవరం మండలం, గూడెం మండలాల్లో కేటాయించిన నాలుగు దుకాణాల కోసం దరఖాస్తు చేసుకొనే గడువు బుధవారంతో ముగిసింది. ఈ గడువును ఎనిమిదో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు పెంచారు. మార్గదర్శకాల ప్రకారం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో దరఖాస్తులను పూర్తి చేసి అందజేయాలని సీఐ కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం



ఇరగవరం వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఇరగవరం: మండలంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు తెలిపారు. బుధవారం ఇరగవరం మండలంలోని అన్నవరప్పాడులో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 17మందికి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కోసూరి రామకృష్ణానంద రాజు తదితరులు పాల్గొన్నారు.

భద్రత నియమాలు పాటించాలి

తాడేపల్లిగూడెం: డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో వాహనానికి సంబంధించిన సర్టిఫికెట్లు వెంట ఉంచుకోవాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సురేంద్రసింగ్ నాయక్ డ్రైవర్లను కోరారు. పట్టణంలోని ఆయన కార్యాలయంలో బుధవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు.వాహనం ట్యాక్సు, ఇన్‌స్రూ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్లు, పొల్యూషన్ సర్టిఫికెట్ తప్పకుండా వాహనంతో పాటు ఉంచుకోవాలన్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రోడ్డు గుర్తులు పాటిస్తూ వాహనాలను నడిపితే ప్రమాదాలు జరుగవన్నారు. భీమవరం నుంచి వచ్చిన వైద్యురాలు హనుమలక్ష్మి గుడ్ సమరిటన్, ప్రాథమిక చికిత్స, సీపీఆర్ గురించి వివరించారు. సీనియర్ అసిస్టెంటు నాగమురళీ, తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ వద్దంటూ నిరసన



నిరసన చేస్తున్న యువకులు

పెంటపాడు: పెంటపాడు గ్రామంలో 1వ వార్డులో అధనంగా మరో జీయో టవర్ వేస్తే సహించేది లేదని పెంటపాడు వార్డు సభ్యులు కాసారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో స్థానిక 1 వార్డు శెట్టిబలిజపేట వద్ద టవర్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని శెట్టిబలిజ పేట వాసులు నిరసన తెలిపారు. తమ సమస్యలను పెంటపాడు పోలీసులకు వినతిపత్రం రూపంలో అందజేసినట్లు వార్డు సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు కాసారపు శ్రీను తెలిపారు.

ప్రీమియం భారం.. బీమాకు దూరం

- పంటల బీమాకు స్పందన కరువు
- ముగిసిన గడువు
- తక్కువ శాతం మాత్రమే చెల్లింపు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నూరుశాతం నమోదు



పొలంలో దమ్ము చేస్తున్న దృశ్యం



పొలంలో సిద్ధం చేసిన నాట్లు (ఫైల్)

పెంటపాడు: భూమిలో విత్తు నాటిన నుంచి పంట చేతికొచ్చే వరకూ అన్నదాతలకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతాయి. వాటిని అధిగమిస్తూ, కష్టనష్టాలను భరిస్తూ ముందుకు సాగాలి. సాగు నీటి కష్టాలు, విత్తనాల కొరత, ఎరువులు దొరక్కపోవడం తుఫానులు, ఇలా అనేక సుడిగుండాలను దాటాలి. ఆ సమయంలో వారికి ప్రభుత్వం అండ చాలా అవసరం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలకు అన్ని విధాలా అండగా నిలిచారు. పంట సాగులో మొదటి నుంచి చివరి వరకూ తోడున్నారు. వాటిలో పంటల బీమా గుర్తించి ప్రధానంగా చెప్పుకోవాలి. రైతుల తరఫున ప్రభుత్వమే బీమా ప్రీమియం కట్టింది. దీంతో ఆ ఐదేళ్లు రైతులకు పూర్తి భరోసా లభించింది. కానీ నేటి కూటమి ప్రభుత్వం బీమా ప్రీమియం భారాన్ని రైతులపై మోపింది. దీంతో కేవలం ఒక శాతం మందికి మాత్రమే బీమా ధీమా లభిస్తుంది.

అన్నదాతల ఆవేదన

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అనేక హామీలు ఇచ్చారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడిసాయం అందిస్తామని వాగ్దానం చేశారు. తీరా అధికారంలోకి వచ్చిన ఏడునెలలు అవుతున్నా, ఆసైసే మరిచారు. అలాగే పంటల బీమా ప్రీమియాన్ని రైతులే కట్టుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. జగన్ ప్రభుత్వంలో ఉచితంగా పంట బీమా పొందిన రైతులందరూ చంద్రబాబు తీరుతో గగ్గోలు పెడుతున్నారు. అసలే పెట్టుబడి డబ్బులు లేక ఇబ్బంది పడుతుంటే, ఇక బీమా ప్రీమియం ఎలా కట్టలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కరువైన స్పందన

పెంటపాడు మండలంలో సుమారు 21వేల ఎకరాలకు గాను కేవలం 280మంది రైతులు మాత్రమే బీమా ప్రీమియం చెల్లించారు. టీడీపీ పాలనలో బీమా చెల్లించడం దండగా అనే అభిప్రాయం రైతుల్లో ఉంది. గతంతోనూ టీడీపీ అధికారంలో ఉండగా రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించినా, ఏ నాడు నష్టం జరిగినా పరిహారం దక్కిన పరిస్థితులు లేవు. ఇకఉప్పుడు కూడా అలాంటి పరిస్థితే ఉంటుందనే భావం రైతుల్లో నెలకొంది. ప్రభుత్వం ఇప్పటికే అనేక సార్లు గడువు పొడిగించినప్పటికీ వారి నుంచి స్పందన కరువైంది.

గతంలో అందరికీ..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మొదటి సంవత్సరం ఒక రూపాయి చెల్లించి బీమాలో పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. ఆ తర్వాత నుంచి రైతుల తరఫున ప్రభుత్వమే బీమా చెల్లించి ఉచిత పంటల బీమాను అమలు చేసింది. దీంతో రైతులకు కూడా ధీమా కలిగేది. ఇప్పుడు పరిస్థితి లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు.

అవగాహన కల్పించాం



పంటల బీమా పథకంలో రైతులు ప్రీమియం చెల్లించుకోవాలని వీఏఏల ద్వారా రైతులకు అవగాహన కల్పించాం. రబీ సీజన్‌లో తక్కువ మంది ప్రీమియం చెల్లించారు. ఎక్కువ మందికి ఆన్‌లైన్‌లో వారి అకౌంట్లు ద్వారా చెల్లింపులు జరిగాయి. బీమా చెల్లించడం వల్ల ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాల నుంచి బయటపడవచ్చు.

కె. పార్థసారది, వ్యవసాయాధికారి, పెంటపాడు మండలం

పాత పద్ధతిని అమలు చేయాలి



గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన మాదిరిగా కూటమి ప్రభుత్వం కూడా ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేయాలి. సాధారణ రైతులతో పాటు, కౌలు రైతులకు కూడా పూర్తి స్థాయిలో పరిహారం అందించేవారు. ఇప్పుడు ఆ విధానం లేకపోవడంతో నష్టం కలుగుతోంది.

– పాలా గణపతి, కొండేపాడు, రైతు

డ్రెయినేజీలు డస్ట్ బిన్‌లు కాదు



పైడిపర్రులో దోమల నిరోధంపై అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: డ్రెయిన్ డస్ట్ బిన్ కాదనే విషయాన్ని ప్రజానీకం గమనించాలని తణుకు సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని పైడిపర్రు సూర్యనగర్‌లో బుధవారం ఆయన క్షేత్ర స్థాయిలో మస్కిటో బ్రీడింగ్ సోర్సెస్‌తో పాటు వెక్టార్ కంట్రోల్ హైజీన్, ఫ్రైడే డ్రైడే పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చెత్త, వ్యర్థాలను డ్రెయినేజీల్లో పారవేయడం వలన దోమల పుట్టుకకు అవాసాలుగా మారుతున్నాయని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య కార్మికులు ఇంటి ముందుకు వచ్చిన సమయంలో చెత్తను డస్ట్ బిన్‌లో వేయాలని సూచించారు. దోమ కాటు బారిన పడకుండా శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు ధరించడం, దోమ తెరల వాడకం, దోమలు ఇళ్లలోకి ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమ వికర్షకాలైన బంతి, పుదీనా, తులసి మొక్కలని పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీ వి.బులి పండు, వార్డు శానిటేషన్ సెక్రెటరీ కె.బాపూజీ, ఆశ కార్యకర్తలు జె.విజయ, సీహెచ్ జ్యోతి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలకు పదవులు

తాడేపల్లిగూడెం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గూడెం నియోజకవర్గంలో పలువురికి పార్టీ పదవులు వరించాయి. యువజన విభాగం అధ్యక్షుడిగా కోడే సత్య శ్రీనివాసు, మహిళావిభాగం అధ్యక్షురాలిగా తాడిపత్రి రజని, రైతు విభాగం అధ్యక్షునిగా తమ్మిశెట్టి ఆదినారాయణ, బీసీ సెల్ అధ్యక్షుడిగా పట్నాల గణపతి ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గంటి చిన్నా, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా డి.రాజశేఖర్ బాబు,మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎస్‌కె.నౌషద్ మొహిద్దీన్‌లను నియమించారు. క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా కొమ్మిశెట్టి జయబాబును నియమించారు. స్టూడెంట్ విభాగం అధ్యక్షుడిగా బండారు వీరనాగేశ్వరరావు, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా పెన్నాడ సూర్యనారాయణ, మునిసిపల్ వింగ్ అధ్యక్షుడిగా కర్రి భాస్కరరావు, ఆర్టీఐ వింగ్ అధ్యక్షుడిగా శిరిగినీడి విజయకృష్ణలను నియమించారు. వాలంటీర్ల వింగ్ అధ్యక్షుడిగా యాదాల గట్టోదరుడు , గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా తెన్నేటి జగ్జీవన్‌లు నియమించారు. వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా మారిశెట్టి వెంకటరమణ, వీవర్స్ వింగ్ అధ్యక్షుడిగా చల్లా లింగమూర్తి, వైఎస్సార్ టీయుసీ అధ్యక్షుడిగా సంపత కృష్ణారావు, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలిగా యాలం నళిని, లీగల్ సెల్ అధ్యక్షుడిగా కర్నాటి కన్నయ్య, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా మానికొండ వెంకటేశ్వరరావులను నియామకం చేశారు. సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా కనుపూరి ఉదయ భాస్కర్, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా వడ్డి శేషు సత్యనారాయణ, దివ్యాంగ విభాగం అధ్యక్షుడిగా పెంటపాటి సత్యనారాయణ, డాక్టర్స్ విభాగం అధ్యక్షుడిగా బాదంపూడి సర్వేశ్వరరావు, ఇంటిలెక్చ్యువల్ ఫోరం అధ్యక్షుడిగా పూతినీడి వెంకటపరమాత్మ, బూత్ కమిటీ అధ్యక్షునిగా వట్టి సోమేశ్వరరావు(బుజ్జి), పబ్లిసిటీ వింగ్ అధ్యక్షునిగా చిట్టూరి కాశీ విశ్వేశ్వరరావులు నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులు బుధవారం వచ్చాయి.

సత్యవతి మృతికి కారుమూరి సంతాపం



సత్యవతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు చీర్ల రాధయ్య సతీమణి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్‌పర్సన్ చీర్ల పద్మశ్రీ మాతృమూర్తి బంటుమిల్లి సత్యవతి మృతికి మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. బుధవారం పెరవలి మండలం కాపవరంలోని వారి నివాసానికి వెళ్లిన కారుమూరి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పద్మశ్రీ, రాధయ్యలను పరామర్శించారు. అనంతరం అనారోగ్యంతో ఉన్న పార్టీ నాయకులు బండి సతీష్, షేక్ బాజీ, బెజ్జవరపు హేమశ్రీ, పంట సూర్యకళలను కలిసి వారి ఆరోగ్యస్థితిపై ఆరాతీశారు. ఇటీవల మృతిచెందిన ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఉరదాల రాంబాబు కుటుంబ సభ్యులను, పార్టీ నాయకులు కాకరపర్తి ఆంజనేయులు తల్లి ఇటీవల మరణించిన నేపథ్యంలో వారి కుటుంబాన్ని, పార్టీ కార్యకర్త వెరవెల్లి కనకం మృతికి సంతాపం తెలిపి, కుటుంబసభ్యులను పరామర్శించారు.

‘మానవత’ సేవలు అభినందనీయం



తణుకులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీవైఈవో మురళీ సత్యనారాయణ

తణుకు అర్బన్: మానవత సేవా సంస్థ సేవాకార్యక్రమాలు అభినందనీయమని డీవైఈవో డి.మురళి సత్యనారాయణ అన్నారు. తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దాతలు సమకూరుస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కెరీర్ గైడెన్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా రానున్న 40 రోజుల్లో పది పరీక్షలకు పూర్తి స్థాయిలో సంసిద్ధంగా ఉండాలని కోరారు. అనంతరం పట్టణానికి చెందిన చిట్టూరి సుజాత సౌజన్యంతో సమకూర్చిన జామెంట్రీ కిట్లు, మానవత జిల్లా కమిటీ సౌజన్యంతో పదో తరగతి చదువుతున్న మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం కె.పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాస్తి సీతామహాలక్ష్మి బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం తోట వరలక్ష్మి, ఏకేటీపీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తానాబత్తుల రామకృష్ణ, మానవత అధ్యక్షురాలు కఠారి శారదాదేవి, శాంతి ర్యాలీ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు, ప్రతిభా పురస్కారాల కమిటీ చైర్మన్ బోయపాటి రామలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు హనుమంతరావు తణుకు మండలం కార్యదర్శి ఎ. రామకాశి, కోశాధికారి అక్కిన కాశీ విశ్వనాథం, తణుకు మండలం అభివృద్ధి కమిటీ చైర్మన్ కఠారి కాశీ విశ్వనాథరాజు, ఆకెళ్ళ సుబ్రహ్మణ్యం, డాక్టర్ కె రామలక్ష్మి, ఓ. వాణి మానవతా సభ్యులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఉమా మహేశ్వరరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక చట్టాలను అమలు చేయలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర సీఐటీయూ ఇచ్చిన దేశ వ్యాప్త నిరసనలలో భాగంగా సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కేఎన్ రోడులో బహిరంగ సభ నిర్వహించి, అనంతరం పోలీస్ ఐలాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గతంలో మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని విమర్శించారు. కేంద్రం లేబర్ కోడ్‌లు అంటూ కార్మికులను బానిసలుగా మార్చుతుందన్నారు. పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు కేంద్రం దాసోం కావడం దారుణమన్నారు. యజమానులకు అనుకూలమైన చట్టలు రావడం సరికాదని, కార్మికులకు అనుకూలమైన చట్టాలు ఉండాలని తెలిపారు. సమ్మె హక్కును కాలరాస్తున్నారని, కేంద్రానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులకు భంగం

ఇరగవరం: లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కామన మునిస్వామి మాట్లాడుతూ బర్ కోడ్ కార్మికుల హక్కులకు భంగం కలిగించేలా ఉందని ఆరోపించారు. కార్మికులు అనేక పోరాటాలు ద్వారా సాధించుకున్న చట్టాలను బీజేపీ మార్చేందుకు చూస్తుందని ఆరోపించారు.

కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ధర్నా



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మిక సమస్యల పరిష్కారం కోసం మరోసారి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సోమసుందర్ కార్మికులకు పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో బడ్జెట్ ప్రసంగ ప్రతులను దహనం చేశారు. సంయుక్త కిసాన్ మంచ్, కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు ఆర్టీసీ డిపో వద్ద భారీ ధర్నా నిర్వహించారు. సోమసుందర్ మాట్లాడుతూ మూడున్నర కోట్ల ఆదాయపు పన్ను చెల్లింపుదార్లుకు స్వల్ప రాయితీలిచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాల సీతారామన్ నలభై కోట్ల అసంఘటిత కార్మికులకు మొండి చేయి చూపారన్నారు. పెన్షనర్ల బాధలను ఆమె పట్టించుకోలేదని విమర్శించారు. ఏరియా కమిటీ కార్యదర్శి మండలపర్తి హరీష్, నిత్యావసర వస్తువులు ధరలు తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళింగ లక్ష్మణరావు, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాస్‌రావు, భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యనిర్వహణ అధ్యక్షులు పడాల శ్రీనివాస్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకులకు పరామర్శలు



రావిపాడులో వింజమూరి నరసింహమూర్తి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వడ్డి రఘురాం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నందమూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కోనేటి దానయ్య తల్లి వెంకటరత్నం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాంనాయుడు బుధవారం ఆయనను పరామర్శించారు. వెంకటరత్నం మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, సేవాదళ్ మండల చైర్మన్ కొండుబోయిన కృపావరం తదితరులు ఉన్నారు.

పెంటపాడు: రావిపాడు గ్రామానికి చెందిన వింజమూరి నరసింహమూర్తి ఇటీవల మృతి చెందారు. రాష్ట్ర వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు వడ్డి రఘురాం బుధవారం వింజమూరి నరసింహమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, దేవరశెట్టి రాంబాబు, గూడెం జెడ్పీటీసీ సభ్యులు ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ శేషులత, మాజీ సర్పంచ్‌లు చల్లా కుమారస్వామి, పుల్లయ్య, ఎం. సతీష్, సొసైటీ మాజీ నాయకులు దాట్ల రామలింగరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు ఆరోగ్య నియమాలు పాటించాలి



ఆర్టీసీ డీఎం కార్యాలయంలో ఫ్యామిలీ కౌన్సిలింగ్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రోడ్డు భద్రత మాసోత్సవాలు సందర్భంగా బుధవారం డ్రైవర్లుకు ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహించారు. డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరిగింది. రోడ్డు ప్రమాదాలు జరగడానికి కారణాలు, ప్రమాదాలు నివారించడానికి తీసుకోవాలిసిన జాగ్రత్తలు, రోడ్డు భద్రత నియమాలు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, దైనందిన అలవాట్లు తదితర విషయాలను చర్చించారు. అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగితే రోడ్డు యూజర్స్, బస్సు ప్రయాణీకులకు కలిగే కష్టాలు, డ్రైవర్లుకు కలిగే నష్టాలను వెల్లడించారు. బస్సు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన భద్రత చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సుధారాణి, డ్రైవర్లు రాజబాబు, వాసులు జోగేశ్వరరావు, దుర్గారావు, బలరామరాజు, వీరన్న, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దేశానికి యువతే పట్టుకొమ్మలు

తాడేపల్లిగూడెం రూరల్: ఉభయగోదావరి జిల్లాల్లో చైతన్యవంతులైన పట్టభద్రులు ఉన్నారని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల శాసన మండలి స్వతంత్ర అభ్యర్థి విష్ణువఝుల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని పెదతాడేపల్లి గాయత్రీ కల్యాణ మండపంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ దేశానికి పట్టుకొమ్మలు యువత అని పేర్కొన్నారు. తన విజయానికి పట్టభద్రులంతా సహకరించాలన్నారు. విష్ణువఝుల సత్యవతి ఉన్నారు.

నేడు, రేపు ఎలుకల నిర్మూలన కార్యక్రమం



ఆర్‌ఎస్.ప్రసాద్
మండల వ్యవసాయాధికారి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో ఈ నెల 6, 7వ తేదిల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల వ్యవసాయాధికారి ఆర్ ఎస్. ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలానికి 200 కిలోల బ్రోమోడయోలిన్ మందు వచ్చిందన్నారు. 6వ తేదిన రైతులు తమ పొలాల్లో ఉన్న ఎలుక బొరియలను గుర్తించి, మట్టితో పూడ్చాలన్నారు. 7వ తేదిన ఉదయం ఎలుక బొరియలు తెరిచి ఉంటే వాటిలో ఎలుకలు ఉన్నట్లు గుర్తించి, ప్రభుత్వం రైతులకు ఉచితంగా సరఫరా చేసిన బ్రోమోడయోలిన్ మందు ఎరను ఉంచాలన్నారు. రైతులంతా ఒకేసారి ఈ ప్రక్రియ చేపట్టాలన్నారు. తద్వారానే ఎలుకల నిర్మూలన సాధ్యమన్నారు. చేల చుట్టూ ఎలుకల నివారణకు విద్యుత్‌వైర్లు పెడుతున్నారని, ఇది ప్రమాదకరమని హెచ్చరించారు. పశువులు, మనుషులు చనిపోయే ప్రమాదం ఉందన్నారు.

8 వరకు దరఖాస్తులకు గడువు పెంపు

తణుకు అర్బన్: తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలో కల్లుగీత కులాలకు కేటాయించిన 5 మద్యం దుకాణాలకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ ఈనెల 8వ తేదీ వరకు పొడిగించినట్లు ఆ శాఖ సీఐ సత్తి మణికంఠ రెడ్డి తెలిపారు. సాయంత్రం 5 గంటలకు దరఖాస్తుల ప్రక్రియ ముగుస్తుందని, 10వ తేదీన ఉదయం 10 గంటలకు భీమవరంలో జిల్లా కలెక్టరు ఆధ్వర్యంలో దరఖాస్తులకు సంబంధించిన లాటరీ తీయడం జరుగుతుందని చెప్పారు.